అద్దె భవనాలు.. అరకొర వసతులు



ప్రకాష్‌నగర్ 38జె బస్టాప్ వద్ద గల అంగన్‌వాడీ సెంటర్

- పలు కేంద్రాల్లో మరుగుదొడ్లు లేవు
- అవస్థల నడుమ అంగన్‌వాడీ కేంద్రాలు
- నెరవేరని ఎమ్మెల్యే గణబాబు హామీ

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు అరకొర వసతుల మధ్య నడుస్తున్నాయి. మరి కొన్ని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. గోడలు బీటలు వారి,రంగులు వెలిసిపోయి కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. దీంతో కేంద్రాల నిర్వహణ అవస్థలమయంగా మారింది.

ఆచరణ ఏదీ?

శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులు చేయిస్తానని సాక్షాత్తూ ఎమ్మెల్యే గణబాబు రెండు వారాల కిందట హామీ ఇచ్చారు. నేటికీ అది కార్యరూపం దాల్చలేదు.దీంతో ఆయా కేంద్రాల్లో చదువుతున్న చిన్నారుల బిక్కు బిక్కు మంటూ గడుపుతున్నారు.

ఆరుబయటకు వెళ్లాల్సిందే..

జీవీఎంసీ 58వ వార్డు రామ్‌నగర్ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మరుగుదొడ్డి, మంచినీటి సౌకర్యాలు లేవు.దీంతో మల,మూత్ర విసర్జనకు చిన్నారులు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీనికి తోడు ఈ కేంద్రం రంగులు వెలిసి ఉంది. అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకురావాలని చిన్నారుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

- 60వ వార్డు బర్మాకాలనీలో అంగన్‌వాడీ సెంటర్‌కు కూడా మరుగుదొడ్డి, మంచినీటి సదుపాయం లేవు. దీంతో మధ్యాహ్నం భోజనం తర్వాత చిన్నారులను తల్లిదండ్రులకు ఇళ్లకు తీసుకు వెళ్లి శుభ్రపరుచుకుంటున్నారు. ఈ అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుంది.
- 61వ వార్డు జనతాకాలనీ,ప్రకాష్‌నగర్ పరిధిలోని రెండు అంగన్‌వాడీ భవనాలు అధ్వానంగా ఉన్నాయి. గోడలు బీటలు వారి, శ్లాబ్ పెచ్చులు ఊడిపోతుంది. దీంతో ఈ కేంద్రానికి పిల్లలను పంపించడానికి తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వారు కలవరం చెందుతున్నారు. అధికారులు స్పందించి కేంద్రాల్లో మంచినీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు పూర్తి చేసి వసతులు కల్పించాలని కోరుతున్నారు.



జనతా కాలనీలో అద్దె భవనంలో..



అద్దె సెంటర్ పిల్లలకు పాఠశాలు చెబుతున్న దృశ్యం



దయనీయంగా జనతాకాలనీ అంగన్‌వాడీ భవనం

స్టీల్‌ప్లాంట్‌పై పవన్ నోరు విప్పాలి

సీపీఎం నాయకుడు జగ్గునాయుడు

మల్కాపురం: ఎన్నికల ముందు స్టీల్‌ప్లాంట్ జోలికి ఎవరు వచ్చినా తాట తీస్తా.. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకుందాం అని వాగ్దానాలు చేసిన జనసేన అధ్యక్షుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేడు ఆ అంశంపై ఎందుకు నోరు మెదపడం లేదో అర్థం కావడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. 61వ వార్డు వెంకన్నపాలెంలోని సోమవారం సీపీఎం మల్కాపురం జోన్ 9వ మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన తొలుత పార్టీ సీనియర్ నాయకులు దివంగత సీతారాం ఏచూరి,సన్యాసిరావు తదితరులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను బడా బాబులకు అప్పజెప్పాలని కేంద్రంలోని బీజేపీ చూస్తుంటే కూటమిలో ఉన్న టీడీపీ,జనసేన నాయకులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకులు జగ్గునాయుడు

పార్టీ సీనియర్ నాయకురాలు పుణ్యవతి మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్,షిప్‌యార్డ్ వంటి పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల వద్ద పని చేస్తున్న కార్మికులకు నేటికీ సమాన పనికి సమాన వేతనం దక్కడం లేదని ఆరోపించారు. కార్మికులకు అండగా సీపీఎం,సీఐటీయూలు ఉంటాయన్నారు. పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నిత్యం కాలుష్యం కమ్మేసే పారిశ్రామిక వాడలో సోమవారం సాయంత్రం ఆకాశంలో అద్భుత దృశ్యం కనిపించింది. సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో ఎర్రటి మేఘాలు చెట్లు మధ్య నుంచి రమణీయ దృశ్యం ఆవిష్కృతమైంది. ఆ చిత్రాన్ని పారిశ్రామిక ప్రాంత వాసులు తమ ఫోన్లలో చిత్రీకరించారు. - మల్కాపురం

క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగికి సన్మానం



అమ్మోరయ్య దంపతులను సత్కరిస్తున్న తోటి ఉద్యోగులు

మల్కాపురం: విశాఖ పోర్టులో ఓ.ఆర్.ఎస్.సెక్షన్‌లో ఆపరేటర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన కాశారపు అమ్మోరయ్య దంపతులను సోమవారం తోటి ఉద్యోగులు కళావేదిక వద్ద సత్కరించారు. అమ్మోరయ్య అందించిన సేవలను అధికారులు ప్రస్తువించారు.శేష జీవితం హాయిగా గడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ మెరైన్ ఇంజినీర్ శివరామకృష్ణచౌదరి,జగదీష్,పి.ఎయ్.ఆర్.ప్రసాద్,సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌తో విద్యుత్ ఆదా



సోలార్ విద్యుత్ ఉపయోగాలపై అవగాహన కల్పిస్తున్న ఏఈ రిషికేష్

అగనంపూడి: సోలార్ విద్యుత్ వినియోగం వల్ల విద్యుత్ ఆదా అవడంతో పాటు విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందని ఈపీడీసీఎల్ ఏఈ రిషికేష్ చెప్పారు. జీవీఎంసీ 86వ వార్డు వుడానగర్ ఫేజ్-1 పార్క్ వద్ద సోమవారం సోలార్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకుంటే రాయితీ అందిస్తామన్నారు. నిర్వహణ భారం కూడా ఉండదని విద్యుత్ ఆదా చేసుకొనే వెసులుబాటు కలుగుతుందని చెప్పారు. ఈపీడీసీఎల్ సిబ్బంది కొండలరావు, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

అంతర పాఠశాలల క్రీడా పోటీలు ప్రారంభం



వందన సమర్పణ చేస్తున్న విద్యార్థులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం జుబ్లీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విశాఖ అతిమేత్రాసన వేదికగా మూడు రోజులు నిర్వహించే అంతర పాఠశాలల క్రీడా పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను విశాఖ జిల్లా డిప్యూటీ విద్యాశాఖాధికారి రవీంద్రబాబు క్రీడా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక దారుఢ్యాన్ని, క్రీడా స్ఫూర్తిని, పోటీతత్వాన్ని పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విశాఖ అతిమేత్రాసన పాఠశాలల డిప్యూటీ జనరల్ మేనేజర్ ఫాదర్ పొలమరశెట్టి రత్నకుమార్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొనరాజు గోపాలకృష్ణ, ఫాదర్లు డి.బాలశౌరి, జొన్నాడ జాన్‌ప్రకాశ్, ఎస్.ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు సహకరించాలి



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని నియంత్రించవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీకి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా నియంత్రణకు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు.

రాధాకృష్ణ మహోత్సవాలను జయప్రదం చేయాలి

మల్కాపురం: నగరంలో ఆర్‌కే బీచ్ వద్ద ఈ నెల 15న గోకుల్ పార్కు వద్ద జరగనున్న రాధాకృష్ణ మహోత్సవాలను యాదవ సోదరులు సోదరీమణులు జయప్రదం చేయాలని జిల్లా యాదవ మహిళ నాయకురాలు తోణంగి వెంకటరమణియాదవ్ పిలుపు నిచ్చారు. మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు.59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఏటా కార్తీకపౌర్ణమి రోజు ఆర్‌కే బీచ్ దరి గోకుల్ పార్కులో రాధాకృష్ణుల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి యాదవ సంఘాల ప్రతినిధులు, యాదవ సామాజిక వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. ప్రతి వార్డు నుంచి యాదవ సోదరులు ర్యాలీగా ఉత్సవాలకు తరలిరావాలని కోరారు.



పోస్టర్ విడుదల చేస్తున్న యాదవ మహిళ సంఘం ప్రతినిధులు

బోరుబావికి మరమ్మతులు చేశారు

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్ పరిధి తుమ్మడపాలెం రైల్వేట్రాక్ రహదారి ప్రాంతంలో ఉన్న మంచినీటి బోరుకు సోమవారం మరమ్మతులు చేపట్టారు. 37/57 నంబర్ గల బోరు మరమ్మతులకు గురికావడంతో ఈ సమస్యపై సోమవారం'సాక్షి' దినపత్రికలో బోరుబావి బాగు చేయరూ!' అనే ఫొటో కథనం వెలువడింది. దీనిపై జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రాము స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు మంచినీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ ఎ.సుమన్ పర్యవేక్షణలో సిబ్బంది బోరుబావికి మరమ్మతులు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



బోరు బావికి మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

ప్రధాన కాలువపై అడ్డంకులు తొలగించండి

జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు షీలానగర్ పెట్రోల్ బంక్ సమీపంలోని ప్రధాన కాలువపై అడ్డంకులు తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జీవీఎంసీ, గెయిల్ అధికారులతో కలిసి ప్రధాన కాలువలపై అడ్డంకులు కలిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. సమస్యపై ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ వివరిస్తూ కాలువ మేహాద్రి గెడ్డ నుంచి నరవ మీదుగా పారుతుందని, 20 అడుగుల వెడల్పుగల ప్రధాన కాలువ గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్) రక్షణ గోడకు ఆనుకొని వెళుతుందని తెలిపారు. ఏడాది నుంచి గెయిల్ యాజమాన్యం కాలువను మూసి వేయడంతో కాలువ సాఫీగా పారేందుకు అడ్డంకులు ఏర్పడ్డాయన్నారు. భారీ వర్షాలకు వరదల సంభవించినప్పుడు చెరువు మాదిరిగా ఈ ప్రాంతం మంతా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని వివరించారు.



షీలానగర్‌లో గెయిల్ కాలువను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

దీంతో స్పందించిన కమిషనర్ కాలువ ఎందుకు మూసివేశారో వివరణ ఇవ్వాలని గెయిల్ అధికారి మూర్తిని ఆదేశించారు. వెంటనే గెయిల్ యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేసి ప్రధానకాలువ సాఫీగా పారేలా చర్యలు చేపట్టాలని, పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులుకు గురికాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్, గాజువాక జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి, పర్యవేక్షక ఇంజినీర్ గోవిందరావు, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



క్రీడా పోటీల్లో పాల్గొన్న వృద్ధులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ విజయనగర్‌కాలనీలోని కేంద్రీయ విద్యాలయం-1లో సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ జి.కిషోర్ నేతృత్వంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో వృద్ధులను ఆనందింపజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.మాలిక్, ఉపాధ్యాయులు, వృద్ధులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

అగనంపూడి: మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారొద్దని, వాటికి దూరంగా ఉండాలని విద్యార్థులకు పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ పిలుపు నిచ్చారు. 85వ వార్డు గొన్నా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం డ్రగ్స్ వల్ల కలిగే హాని, వాటి ప్రభావంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.డ్రగ్స్‌కు బానిసలుగా మారితే వారి జీవితాలే కాకుండా కుటుంబం మొత్తం అస్తవ్యస్తమవుతుందన్నారు. గంజాయి అక్రమ రవాణాలో ఎక్కువగా బాగా చదువుకున్న వారే ఇటీవల కనపడుతున్నారని ఆందోళన వ్యకం చేశారు. అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు చిక్కిన విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయన్నారు. మత్తు పదార్థాల వల్ల విచక్షణా జ్ఞానం కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారన్నారు.

ప్రతిధ్వనించిన పంచాక్షరి

మల్కాపురం: కార్తీక మాసం రెండో సోమవారం కావడంతో పారిశ్రామిక ప్రాంతంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువుదీరిన భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామికి ఆలయ అర్చకులు పంచామృతాలు,విభూధి,బిల్వ పత్రాలతో అభిషేకాలు చేశారు. మహిళలు ఇక్కడ శివ నామాలను పఠించారు.

- మల్కాపురం రెడ్డివీధి శివాలయంలో వేకవ జాము నుంచే పూజలు చేశారు. శివలింగానికి అర్చకులు పలు సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం శివపురణాన్ని భక్తులకు వివరించారు.
- ప్రకాష్‌నగర్‌లోని శివరామకృష్ణాలయం,శ్రీహరిపురం వద్ద శివాలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.



పూజలందుకున్న శివయ్య



పూజలందుకున్న చంద్రమౌళేశ్వర స్వామి

నమో శివరుద్రాయ

విశాఖ విద్య: కార్తీకమాసంలోని రెండో సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. హరనామస్మరణతో శైవ క్షేత్రాలన్నీ మార్మోగాయి. ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ వద్ద శివాలయం, సుసర్లకాలనీ చంద్రమౌళేశ్వర స్వామి వారి ఆలయంతో పాటు గోపాలపట్నం, చంద్రానగర్, నాగేంద్రకాలనీ శివాలయాల్లో తెల్లవారు జాము నుంచే భక్తుల సందడి కనిపించింది. స్వామి వారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకం జరిపించారు. కార్తీక నోము పాటించిన భక్తులు తిరిగి సాయంత్రం కూడా శివాలయాలను దర్శించుకొని పూజలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించి, శివ పార్వతులకు ప్రత్యేకక పూజలు చేశారు. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



రెడ్డివీధి ఆలయంలో ..

యువకుడి ఆత్మహత్య

మర్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మానగర్ శివాలయం వీధిలో నివసిస్తున్న చంద్రశేఖర్ (35) సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు విగతజీవిగా వేలాడుతున్న చంద్రశేఖర్‌ను కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించుకుని, పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక తవ్వకాలు ప్రైవేటుకివ్వడం అన్యాయం

సీతంపేట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి సంతకం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఫైల్‌పై పెడతామని హామీలిచ్చిన నాయకులు నేటికీ అమలు చేయలేదని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మండిపడ్డారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికై సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శులు ఎం.పైడిరాజు, జి.ఎస్.జె.అచ్యుతరావు మాట్లాడుతూ గతంలో ఉచిత ఇసుక ఇవ్వాలని, సంక్షేమ బోర్డు పునఃప్రారంభించాలని రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ, ఏఐటీయూసీ చేపట్టిన ఉద్యమానికి కూటమి నాయకులు మద్దతు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక పక్కన పెట్టారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నా 50 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించకపోవడం దారుణమన్నారు. ఉచిత ఇసుక అని ప్రకటించారు తప్ప ఎక్కడా ఉచితంగా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. జీవో నంబరు 66 రద్దు చేయకుంటే ఉచిత ఇసుక పాలసీ నిర్వీర్యం అవుతుందన్నారు. ఇసుక మాఫియాను అరికట్టాలని, ఇచ్చిన మాట ప్రకారం సహజ సంపదను సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా సరఫరా చేసి నిర్మాణ రంగంపై ఆధారపడిన భవన నిర్మాణ కార్మికులకు మేలు చేయాలని కోరారు. అనంతరం లేబర్ కమిషనర్ కార్యాలయంలో పర్యవేక్షణ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎం.మన్మథరావు, ఎస్.కె.రెహమాన్, జి.రాంబాబు, జె.డి.నాయుడు, ఎంఏ బేగం, ఎన్.నాగభూషణరావు, ఎన్.అసిరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



లేబర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

సీతంపేట : ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. 14న ఉదయం 10 గంటలకు ప్రారంభ సమావేశం, 15న సాయంత్రం విశాఖ సాహితి ఆధ్వర్యంలో సాహిత్య క్విజ్, 16న సాయంత్రం విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో కవితా గోష్టి నిర్వహిస్తామని తెలిపారు. 17న సాయంత్రం క్రియేటివ్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో వినోద వల్లరి కామెడీ స్కిట్స్, 18న ఉదయం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి, 19న సాయంత్రం అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో సాహితీ ప్రసంగం, 20న 'కథా రచయితలతో చర్చా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

సమ్మెకాలానికి జీతాలపై హర్షం

విశాఖ విద్య: సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మె కాలానికి జీతాలు విడుదల చేయడంపై ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గణపతిరావు, చైతన్య ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులకు ఇది ఊరట నిచ్చే విషయమన్నారు. త్వరలో ప్రకటించే డీఎస్సీలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అర్హత గల సిబ్బందికి వెయిటేజీ ఇవ్వాలని కోరారు.

'ల్యాబ్ టూ స్కూల్'తో మేలు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం ల్యాబ్ టూ స్కూల్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు, విద్యార్థులు స్థానిక ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాలను సందర్శించి పాఠశాల విద్యార్థులకు ప్రయోగాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించి, వారిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ల్యాబ్ టూస్కూల్ కార్యక్రమం తమ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని కళాశాలను అభినందిస్తూ ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోగేంద్రనాథ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు బి.సంతోషి అనూష, హైమావతి పాల్గొన్నారు.



ప్రయోగాలు చేసి వివరిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్ - 5 కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై 5 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము నేరుగా వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని ఆయన సూచించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 03, రెవెన్యూ విభాగానికి 02 వినతులు అందినట్లు తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు అధికారులు, ఇతర సిబ్బంది తప్పకుండా హాజరుకావాలని తెలిపారు. సమయపాలన పాటించని ఏపీడీవోలు, టౌన్‌ప్లానింగ్ అధికారులపై జెడ్సీ మండిపడ్డారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఏఈ సుమన్ పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము